IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

# అల్పజీవి నవల – ఇతివృత్తం, పాత్రల చిత్రణ

Dr T Ogeswara Rao

Lecturer in Telugu

V V Giri Government Kalasala, Dumpagadapa

విషయ సంగ్రహం :

సాహిత్యం సమాజాన్ని ప్రతిఫలింపజెయ్యాలి. ఇతర సాహిత్య ప్రక్రియ కన్నా నవలా సాహిత్యమే జీవితాన్ని విస్తృతంగా ఫోటో తీయగలుగుతుంది. మన చుట్టూ ఉన్న సమాజంలో లోటుపాట్లని చూపించి మార్పుకు దోహదపడుతుంది. సామాజిక వాస్తవికతతో, అభ్యుదయ ప్రగతి కాముక భావజాలంతో నిండిన రచన సామాజిక మార్పును వేగవంతం చేస్తుందనేది యధార్థం. వస్తు శిల్పపరంగా రావిశాస్త్రి నవలలకి ముఖ్యంగా 'అల్పజీవి' నవలకు ఆ శక్తి ఉందని నా నమ్మకం. మనోవైజ్ఞానిక నవలలలో ఒకటిగా భావించే ఈ 'అల్పజీవి' నవల ఆధారంగా రావిశాస్త్రి నవలలోని ఇతివృత్తాలను, పాత్రల చిత్రీకరణను అధ్యయనం చేయడం ఈ పరిశోధనా పత్రం లక్ష్యం. దీనికి అవసరమైన సామగ్రిని కళాశాల గ్రంథాలయం, అంతర్జాలాల నుండి తీసుకున్నాను.

ముఖ్యమైన పదాలు :

రావిశాస్త్రి, అల్పజీవి, సుబ్బయ్య, వెంకట్రావు, మనోరమ, గవరయ్య

పరిచయం :

"రచయిత ప్రతివాడు తాను వ్రాస్తున్నది ఏమంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకు ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం వుందని నేను తలుస్తాను. మంచికి హాని, చెడ్డకు సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను"[1] అన్నారు రావిశాస్త్రి. తెలుగు వచన సాహిత్యంలో అత్యంత ప్రతిభావంతులు, వస్తుపరంగా, శిల్ప దృష్ట్యా సాహిత్యాన్ని వినూత్న పద్ధతిలో నడిపించిన ఉత్తరాంధ్ర పేద ప్రజల జీవద్భాషా రచనా శిల్పి, పీడిత ప్రజలకు కొండంత అండ రావిశాస్త్రిగా ప్రసిద్ధులైన రాచకొండ విశ్వనాథశాస్త్రి. వచన రచనా వైవిధ్యంలో రావిశాస్త్రి గురజాడ వారసులు. వామపక్ష ఉద్యమాల ఐక్య భావస్ఫూర్తిగల ప్రగతి కాముకులుగా, విప్లవ రచయితల సంఘం (వి.ర.సం.) వ్యవస్థాపక సభ్యునిగా, బాధాసర్పదష్టుల పక్షాన నిలిచిన న్యాయవాదిగా రావిశాస్త్రి సుప్రసిద్ధులు.

రాచకొండ నారాయణమూర్తి, సీతాలక్ష్మి దంపతులకు 1922 జూలై 30 న రాచకొండ విశ్వనాథశాస్త్రి గారు శ్రీకాకుళంలో జన్మించారు. ఈయన స్వస్థలం అనకాపల్లి దగ్గర తుమ్మపాల గ్రామం. ఈయన తండ్రి న్యాయవాది, తల్లి సాహితీకారిణి.

రావిశాస్త్రి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి తత్వశాస్త్రంలో బీ.ఏ (ఆనర్స్) చదివి, మద్రాసు యూనివర్సిటీ నుండి 1946 లో లా పట్టభద్రులయ్యారు. తన పితామహుడైన శ్రీరామమూర్తి గారి వద్ద న్యాయ వృత్తి మెళుకువలు నేర్చుకొని 1950 లో సొంతగా ప్రాక్టీసు పెట్టుకున్నారు. ఆరంభములో కఠోర కాంగ్రేసువాది అయినా 1960 లలో మార్క్సిష్టు సిద్ధాంతాలచే ప్రభావితులయ్యారు. 1983 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు గౌరవ కళాప్రపూర్ణను ప్రకటిస్తే దానిని తిరస్కరించారు. అంతే కాకుండా 1966లో తీసుకున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును కూడా తిరిగి ఇచ్చివేశారు.

1947 ప్రాంతంలో అనగా న్యాయవాది వృత్తిని స్వీకరించక ముందే శ్రీకాకుళం, విశాఖ జిల్లాల జన జీవితాన్ని విస్తృతంగా పరిశీలించారు. పట్టణ జీవితంలో వస్తున్న పెనుమార్పులను గమనించారు. గురజాడ అప్పారావు, శ్రీపాదల తరువాత మాండలిక శైలిని ఆయనంత ఎక్కువగా వాడిన వారు లేరు. అమానుషత్వం పెరుగుతున్న నమాజంలో గిలగిలలాడే వారి ఆరాటాలను తన రచనలలో చిత్రించారు. రావిశాస్త్రి కథా కథన పద్ధతి చాలా పదునైనది, కాపీ చేస్తే తప్ప అనితరసాధ్యం.

రావిశాస్త్రిగారు రచయిత మాత్రమే కాదు ఎందరో రచయితలకు మార్గనిర్దేశకులు కూడా. "రచయితగా నన్ను నేను దిద్దుకోడానికీ సహాయపడ్డవారు చాలా మందున్నారు. ఆ విషయంలో టాగూర్, శరత్, విశ్వనాథ మొదలుకొని, నిన్న మొన్న కథలు చెప్పడం ఆరంభించిన రచయితల వరకూ ఎందరికో ఋణపడి వుంటాను. ఇందులో తక్కిన వారందరూ ఒక ఎత్తు. రావిశాస్త్రిగారు ఒక్కరే ఒక ఎత్తు. దారి తప్పిన నా రచనా వ్యాసంగాన్ని వారి స్నేహ సావాసాలే సరైన దారిలో పడేశాయి"[2] అని కాళీపట్నం రామారావుగారు పేర్కొన్నారు.

1938లో రావిశాస్త్రి రాసిన 'దేముడే చేశాడు' కథ వినోదిని పత్రికలో అచ్చయింది. జాస్మిన్, శంకరగిరి, గిరిజా శంకరం, కాంతాకాంత, గోలుకొండ రాంప్రసాద్, అంజానా, రావిశాస్త్రి కలం పేర్లతో తొలి దశల్లో రచనలు చేశారు. రావిశాస్త్రి కథకుడు, నవలా రచయిత, నాటక కర్త. తెలుగు కథా సాహిత్యంలో 'ఆరుసారా కథలు' ఒక మలుపు. అంతకుముందు రచయితలు స్పృశించని ప్రాంతీయ, సామాజిక వర్గాలకు సంబంధించిన వ్యక్తుల్ని పాత్రలుగా తన కథల్లో మలిచారు. పోలీసు, న్యాయ వ్యవస్థల్లోని డొల్లతనాన్ని నిశితంగా ఎండగట్టారు. శ్రీశ్రీ 'కాదేదీ కవితకనర్హం' అని ప్రకటించిన తొమ్మిది వస్తువుల్లో ఎనిమిదింటిని 'ఋక్కులు' కథలుగా రాశారు. వర్గభేదాలు మానవ సంబంధాలను నాశనం చేస్తున్నాయని 'బాకీ కథలు' రాసి చూపించారు. తమ అభివృద్ధిపై తప్ప సాటి మనుషుల బాధల పట్ల కనీస స్పందన లేని మధ్యతరగతి ఉద్యోగవర్గంపై కోపాన్ని 'వేతనశర్మ' కథలో ప్రదర్శించారు. 'బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ' అన్న పద్యపాదం సారాన్ని తిరుగుబాటుకు అన్వయించి 'పిపీలికం' రాశారు. 'జరీ అంచు తెల్లచీర' కథ ఒక నమూనాగా మారిపోయి, ఎన్నో అనుకరణల్ని, అనుసరణల్ని పొందింది. 'కార్నర్ సీటు' గొప్ప ఆలోచనాత్మకమైన కథ. రావిశాస్త్రి కథల్లో జీవిత వాస్తవం ఉంటుంది.

ఆంధ్రలో మద్యపాన నిషేధ చట్టం తెచ్చి పెట్టిన అనేక విపరిణామాలను చిత్రిస్తూ ఆయన అద్భుతంగా రాసిన ఆరుసారా కథలు తెలుగు కథా సాహిత్యంలో ఒక విప్లవాన్ని సృష్టించి అందరిని ఆలోచింపజేశాయి. అధికార గర్వానికి ధనమదం తోడైతే పై వర్గం వారు ఎటువంటి దుర్మార్గాలు చేయగలరో ఆయన నిజం నాటకంలో వ్యక్తం చేశారు.

రావిశాస్త్రి గారి తొలినవల 'ఆడదాని సాహసం'. ఇది అముద్రితం. వీరికి బాగా పెరుతీసుకొచ్చిన నవల 'అల్పజీవి'. ఇది మనోవైజ్ఞానిక నవల. బతుకును భయం దుర్భరం చేస్తుందని, భయానికి మంచికి పొందిక లేదని, పిరికివారెవరూ మంచివారు కాజాలరని రావిశాస్త్రి నమ్మకం. అందుకు నిదర్శనంగా అల్పజీవి నవలలో సుబ్బయ్య పాత్ర సృష్టించారు. వీరు అసంపూర్ణంగా రాసిన 'రాజు–మహిషి' జనాకర్షక నవల. రచయిత సైద్ధాంతిక అవగాహన, మనుషుల స్వభావాలను పట్టుకొనే చాతుర్యం అందులో కనిపిస్తాయి. 'గోవులొస్తున్నాయి జాగ్రత్త' ఒక పెట్టుబడిదారుడి అంతరంగ కథనం. 'రత్తాలు–రాంబాబు' అసంపూర్తి నవల. దీనిని ఎమర్జెన్సీ కాలంలో జైలులో ఒంటగా రాశారు. ఈ నవల వివిధ జీవిత కోణాల్ని విస్తృతంగా చిత్రిస్తుంది. గ్రామీణ, భూసంబంధాల ఆధారంగా 'సొమ్ములు పోనాయండి' రాశారు. మానవధర్మాన్ని ఆలంబన చేసుకొని రావిశాస్త్రి రచనలు చేశారనే వాదానికి బలమైన ఉదాహరణ 'మూడు కథల బంగారం' నవల. ఆస్తి దురాక్రమణ ఇతివృత్తంగా వారి చివరి నవల 'ఇల్లు' వెలువడింది.

రావిశాస్త్రి మూడు నాటకాలు రాశారు. అవి– తిరస్కృతి, నిజం, విషాదం. 'నిజం' రంగస్థలంపై విజయవంతంగా ప్రదర్శితమైంది. ఈ నాటకంలోని సార్వభౌమరావు పాత్ర తరవాతి కాలంలో నాటకాలు, చలన చిత్రాల్లో దురహంకార పాత్రలకు నమూనాగా నిలిచింది.

రావిశాస్త్రి గారు కథకులే కాదు నటుడు కూడా. ఆయన వ్రాసిన నిజం నాటకంలోను, గురజాడ కన్యాశుల్కం నాటకంలోను నటించారు.నిజం నాటకం ఆరోజుల్లోనే, అంటే 1962 ప్రాంతంలో వంద ప్రదర్శనలు ఇవ్వడం విశేషం.

రావిశాస్త్రి రచనాశిల్పం విలక్షణం. కథాశిల్పంలో ఆయన పోయినన్ని పోకడలు, చేసినన్ని ప్రయోగాలు ఎవరూ చేయలేదు. ఉత్తరాంధ్ర మాండలికానికి పెద్దపీట వేశారు. మెరుపుల్లాంటి చిన్న వాక్యాలు రాయడం, ఒక్కొక్క వాక్యాన్ని ఒక్కో పేరాగా రాయడం రావిశాస్త్రి ప్రారంభించిన పద్ధతే. కథనంలోనూ, కథా వస్తువును దర్శించడంలోనూ కవిత్వానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన వర్ణనలు,

ఉపమాలంకార వైవిధ్యం పాఠకుల్ని అమితంగా ఆకర్షిస్తాయి. ఆయనది ఆలంకారిక శైలి. కథల్లో, నవలల్లో చమత్కారాలు కొల్లలుగా కనిపిస్తాయి. తన రచనల్లో తాను నమ్మిన మార్క్సిస్టు భావజాలాన్ని కళాత్మక రీతిలో ప్రకటించారు. రావిశాస్త్రి భావాలతో విభేదించే వారు సైతం ఆయన రచనల్ని అభిమానిస్తారు. ఆయన రచనా శిల్పంలోని సమ్మోహక శక్తి దానికి కారణం. తన రచనలపై చెహోవ్, డికెన్స్, విక్టర్ హ్యూగో, ఓ హెన్రీ, మొపాసా, టాల్ స్టాయ్ ప్రభావం ఉందని, తెలుగు రచయితల్లో గురజాడ, శ్రీశ్రీ చాలా ఇష్టమని ఆయనే చెప్పుకోన్నారు. 1968లో 'రాచకొండ విశ్వనాథ శాస్త్రి కథలు' కు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. కొన్నాళ్లు విప్లవ రచయితల సంఘంలో సభ్యుడిగా ఉన్నారు. 1993 నవంబర్ 10న రావిశాస్త్రి కన్నుమూసిన ఆయన రచనలు తెలుగు పాఠకుల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచే ఉంటాయి.

తెలుగు నవలా ప్రపంచంలో విజయవంతమైన, ప్రయోగాత్మక నవలల్లో రావిశాస్త్రి రచించిన అల్పజీవి మిక్కిలి ఎన్నదగినది. జేమ్స్ జాయిస్ 'చైతన్య స్రవంతి' ధోరణిలో వచ్చిన మొదటి తెలుగు నవల ఇది. ఈ నవలను ఆయన 1952లో రచించారు. ఈయన రచించిన నవలల్లోకెల్లా ఈ అల్పజీవి నవలనే ఉత్తమమైన నవలగా విమర్శకులు భావించారు. ఆయన నవలల్లోకెల్లా అత్యధిక ప్రజాదరణ పొందిన నవల కూడా ఇదే.

"జీవితం అంటే మార్పు జీవితమంటే సంచలనం అందువల్ల ఎవరూ బెదిరి పోకూడదు. ఈ సత్య మెరిగి బ్రతకాలనే నీతిని బోధించే 'అల్పజీవి' నవల రావిశాస్త్రి గొప్ప సృష్టి"[3] అని ద్వా.నా.శాస్త్రి గారు ప్రశంసించారు.

"ఈ నవల ఆడ్లర్ 'ఆత్మన్యూనతా భ్రాంతి' సిద్ధాంతం ప్రాతిపదికగా గల రచన. ఈ ఆత్మన్యూనతా భ్రాంతి బాల్యదశలోనే ఏర్పడుతుందని, వయసు వచ్చిన తరవాత అదే అసాధారణ ప్రవర్తనకు హేతువౌతుందనీ ఆ సిద్ధాంతం చెపుతుంది. మానవ ప్రవర్తనను తీర్చిదిద్దడంలో పరిసరాల ప్రభావం, ముఖ్యంగా బాల్యదశలో కుటుంబ వాతావరణ ప్రభావం బలీయమైనదని ఆడ్లర్ సిద్ధాంతీకరించాడు"[4] అని ఆర్.ఎస్.సుదర్శనం గారు అల్పజీవి నవల మూల సూత్రాన్ని గురించి పేర్కొన్నారు.

ఇతివృత్తం :

రచయిత దృక్పథం ఇతివృత్త స్వీకరణ, నిర్వహణను బట్టి చెప్పవచ్చు. ఇతివృత్త స్వీకరణా వైవిధ్యం రచయిత నేర్పరితనంపై ఆధారపడి ఉంటుంది. సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యల పట్ల స్పందిస్తూ, యుగధర్మాన్ని గుబాళింపజేస్తూ ప్రగతి కాముక రచయిత తన రచనలు కొనసాగిస్తాడు. వర్తమాన ప్రాపంచిక చరిత్రకు ఏ ప్రగతి శీల రచయితా దూరంగా ఉండలేదు. రావిశాస్త్రి కూడ తన నవల ఇతివృత్తాల ద్వారా సామాజిక పోకడలని, ధన, అధికార దురహంకారాన్ని, దురన్యాయాన్ని, భూదాహాన్ని, అస్తుల అపహరణామనస్తత్వాన్ని, సంపన్న వర్గం బక్క జీవులను అణిచివేస్తున్న తీరుని, ధన సంపాదనతో జీవితాలలో ఏర్పడే మార్పుని, స్త్రీల జీవితాల్ని, వేశ్యరికాన్ని, పోలీసు, న్యాయ, రాజకీయ రంగాలని, మధ్య తరగతి, అట్టడుగు ప్రజల జీవన విధానాన్ని విశదం చేశారు.

నవలకు కథావస్తువు ప్రాణం వంటిదని సాహితీ విమర్శకులు భావిస్తారు. "మంచి నవలాకారులు తమకు తెలిసిన జీవితంలోంచే లేక తమ అనుభవాల ఆధారంగానే కథావస్తువును ఎన్నుకుంటారు. అయితే గొప్ప నవలలు రచించబడాలంటే నవలాకారుల జీవితానుభవ వైశాల్యం గొప్పగా ఉండాలి"[5] అని అంపశయ్య నవీన్ గారు పేర్కొన్నారు.

ఇతివృత్తంతో పరిచయం లేకుండ, అందులోని పాత్రల గురించిగాని, వివిధ ప్రభావాల గురించిగాని అవగాహన ఏర్పరచుకోవటం కష్టం.

'అల్పజీవి' నవల 1953 జనవరి నుండి ఏప్రిల్ వరకు 'భారతి' సాహిత్య మాస పత్రికలో ధారావాహికంగా ప్రచురించబడింది. 1954 డిసెంబరులో పౌర సాహితీ పక్షాన 'అల్పజీవి' పుస్తకంగా వెలువడింది. అంతకు ముందు ఎన్నో మారుపేర్లతో రచనలు చేసినప్పటికి మొట్టమొదటి సారిగా రాచకొండ విశ్వనాథశాస్త్రి పేరుతో అచ్చైన తొలి నవల 'అల్పజీవి'. రావిశాస్త్రి ఈ నవలను 'అయ్యారే బాబారే' పేరుతో రచించారు. ఒకనాటి సుప్రసిద్ధ సాహిత్య మాసపత్రిక 'భారతి' సంపాదక వర్గ సభ్యులు శ్రీ వి.డి. ప్రసాదరావు ఈ నవలకు 'అల్పజీవ' అని పేరు

పెట్టారు. శ్రీ శ్రీ, పురిపండ అప్పలస్వామి లాంటి సాహితీ ప్రముఖులు దీనిని ప్రశంసించటం రావిశాస్త్రికి సాహితీపరంగా మనో ధైర్యం కలిగింది.

నవలా సాహిత్యంలో ఒక వినూత్న ఒరవడికి అల్పజీవి నాంది పలికింది. ప్రసిద్ధ మనస్తత్వ శాస్త్రవేత్త ఆడ్లర్ సూత్రీకరించిన ఆత్మ న్యూనతా భ్రాంతి (Inferiority Complex) ప్రభావం మరియు జేమ్స్ జాయిస్ 'యులిసిస్' (Ulisess) ప్రభావం కూడా ఈ నవలపై వుంది. "సుబ్బయ్య పాత్రకి శ్రీ శ్రీ గారి 'కొనేటి రావు' కొంతగా నమూన, నిజజీవితంలో చాలా నమూనాలు"[6] అని రావిశాస్త్రి స్వయంగా చెప్పుకున్నారు. శ్రీ శ్రీ రూపొందించిన మధ్యతరగతి గుమస్తా పాత్ర కొనేటిరావు.

ప్రతి వ్యక్తి జీవితాన్ని కొన్ని భాగాలుగా విభజించుకోవచ్చు. ముఖ్యంగా ప్రతి ఒక్కరికి అంతరంగిక, బాహిరజీవితాలుంటాయి. ఈ రెండింటి మధ్య ఘర్షణ, సామాజిక కట్టుబాట్లకు, నియమాలకు తలొగ్గటం, కాలానుగుణంగా వాటిని ఎదిరించ వలసిన పరిస్థితులు ఏర్పడినప్పుడు మానసికంగా ఎంతో ఒత్తిడికి గురవుతారు. బాహిర, అంతరంగిక స్థితులు రెండు చైతన్యస్రవంతిలో రెండు పాయలుగా వుంటాయి. అయితే అంతర్మధనానికి, అంతర్గతాలోచనా స్రవంతికి అక్షరాకృతి నివ్వటమే చైతన్య స్రవంతిగా భావించాలి. ఏదైనా ఒక సామాజిక సంఘటనకో లేదా తన వ్యక్తిగత జీవితంలో తారసపడిన సన్నివేశానికో ఒక వ్యక్తి మానసికంగా ఎలా ప్రతిస్పందిస్తాడు; అతని భావప్రకంపనలు ఎలా పరివర్తిస్థాయనే అంశాన్ని వివిధకోణాల నుంచి విశ్లేషించి చిత్రీకరించటమే చైతన్యస్రవంతి మార్గం లేక మనోవిశ్లేషణాత్మక విధానం. ఈ పద్ధతినే అనుసరించాలని కాకపోయినా; ఈ ప్రభావానికి లోనై రావిశాస్త్రి 'అల్పజీవి'ని రచించారు.

అల్పజీవిలోని కథావస్తువు ఆత్మన్యూనతాభావం (Inferiority Complex), కథన శిల్పం చైతన్య స్రవంతి (Stream of Consciousness). బుచ్చిబాబు 'చివరకు మిగిలేది', గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర' 'అల్పజీవి'కి ముందువచ్చిన మంచి మనోవైజ్ఞానిక నవలలు. 'చివరకు మిగిలేది'లో ఈడిపస్ కాంప్లెక్సు ఇతివృత్తం కాగా 'అసమర్థుని జీవయాత్ర' ఆలోచనా పరుడుగా గోపీచంద్, భౌతికవాదం నుంచి ఆధ్యాత్మిక వాదానికి చేసిన యాత్రను వర్ణిస్తుంది. దయానిధి, సీతారామారావుల కంటే సుబ్బయ్యలోనే ఆత్మన్యూనతాభావం గూడుకట్టుకొని ఉంది. చిన్ననాటి సంఘటన, తనచుట్టూ ఉన్న వాతావరణం సుబ్బయ్యలో ఈ భావాన్ని అధికం చేశాయి. భయం, భయం సుబ్బయ్య జీవిత మంతా భయంతో నిండిపోయంది. ఆ భయం నుంచి బయటకి రావాలని సుబ్బయ్య చేసే విఫల ప్రయత్నమే 'అల్పజీవి' లోని కథావస్తువు. Theory of Complexes కు మూల పురుషుడైన ఆట్లేర్ తన Life Style సిద్ధాంతాన్ని నిర్వచిస్తూ 'న్యూరోసిస్'ను గురించి ఇలా అన్నారు.

"Every Neurosis can be understood as an attempt to free oneself from a feeling of inferiority in order to gain a feeling of superiority"[7]. సుబ్బయ్యకు ఈ సూత్రం దాదాపు సంపూర్ణంగా వర్తిస్తుంది. కాని ఈ సూత్రం మొత్తాన్ని సుబ్బయ్య జీవితానికి ఆపాదించడం సముచితం కాదు. సుబ్బయ్య చుట్టూ పరుచుకొని వున్న అస్తిత్వం, అతనిలో నూతన ఆలోచనా జ్యోతిని అంకురింపజేస్తుంది. భయంతో కూడుకున్న ఆత్మన్యూనతా భావాన్ని కూడా ఈ అస్తిత్వంలో అంతర్భాగంగా పరిగణించాలి.

అల్పజీవిలో కథానాయకుడైన అల్పజీవి సుబ్బయ్య, సోమయ్యకు మొదటి భార్య వలన కలిగిన ఏకైక సంతానం. సుబ్బయ్య పుట్టుకతోనే తన తల్లిని కోల్పోయాడు. జీవితంలో అచ్చట, ముచ్చట తీరకుండానే, రెండుపదుల వయస్సు దాటకుండానే అతని తండ్రి కూడా పరమపదించాడు.

సుబ్బయ్య 5సం. వయసప్పుడు, సోమయ్య రెండవ వివాహం చేసుకున్నాడు. ఈ రెండవ భార్య చాలా వికృతంగా ఉండటమే గాకుండా, చాలా క్రూరంగా ఉండేది. కాపురానికి వచ్చిన మరునాటి నుండే సుబ్బయ్యను కొట్టి హింసిస్తూ అసలే భయస్తుడైన సుబ్బయ్యను మరీ పిరికి వానిగా తయారుజేసింది. పెళ్ళైనా సంవత్సరానికే ఆమె పక్కింటాయనతో లేచిపోయింది.

ఒకనాటి రాత్రి సమయంలో సుబ్బయ్య అతని తండ్రి నడిచి వెళ్తుంటే ఎవరో ముగ్గురు వ్యక్తులు అటకాయించి సోమయ్యను చితకబాదుతారు. ఈ సన్నివేశం సుబ్బయ్యలో విపరీత భయానక వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఒక చలన చిత్రంగా ఈ సన్నివేశం జీవితాంతం సుబ్బయ్యను భయానకంగా వెంటాడుతుంది.

స్కూల్ ఫైనల్ పాసైనాక, పద్దెనిమిదేళ్ళు నిండీ నిండగానే గుమస్తా ఉద్యోగంలో చేరాడు సుబ్బయ్య. జమిందారీ వంశంలో పుట్టిన వెంకట్రావు సుబ్బయ్యకు క్లాస్మేట్. సుబ్బయ్యకు ఉద్యోగం వచ్చిందని తెలియగానే, వెంకట్రావు తన చెల్లి సావిత్రిని సుబ్బయ్యకు ఇవ్వడానికి సిద్ధపడతాడు. అప్పటికి సావిత్రి వయస్సు 13 సం.లు. జమిందారీ వంశంలో పుట్టిన పిల్ల తనకు భార్య అవుతుందని కలలో గూడా ఊహించని సుబ్బయ్య సావిత్రిని చేసుకోవడానికి పరమానందంగా ఒప్పుకుంటాడు. పెళ్ళి పీటల మీద అపురూప సౌందర్యరాశిగా వున్న సావిత్రిని చూసిన సుబ్బయ్య ఆనందాశ్చర్యాలతో భగవంతునికి నమస్కరిస్తాడు. కానీ సావిత్రి మాత్రం ఏనాడు సుబ్బయ్యని తనకు తగిన భర్త అని భావించలేదు. 'నువ్వు చాలా ఇనెఫిషియంట్ గా కనిపిస్తున్నావు' అని ఆఫీసులో డిస్పేచ్ సెక్షన్ అప్పగిస్తే సంవత్సరాల తరబడి ఆ సీటునే అంటిపెట్టుకొని పనిజేశాడు సుబ్బయ్య. కొత్త హెడ్ గుమస్తా రామస్వామి సుబ్బయ్యను అకౌంట్సు సెక్షన్ కి మార్చాడు. ఈ సెక్షన్లో కాంట్రాక్టర్ల బిల్స్ చెక్ చేయటం ముఖ్యమైన పని.

సావిత్రిని పెళ్ళిజేసుకొని పదిహేను సంవత్సరాలు దాటినా, ఆమెతో ఇంకా అలవాటు బడలేదు సుబ్బయ్య. తరచు వీధి వరండాలో కూర్చొని వచ్చే పోయ్యేవాళ్ళని తదేకంగా చూస్తూ ఉంటాడు.

వెంకట్రావు తండ్రి చనిపోయిన తరువాత, అతని మేనమామ నర్సయ్య అప్పుల బాధల్లో ఉన్న కుటుంబాన్ని చక్కబరుద్దామని, వీలైతే తన కూతురు శాంతమ్మను వెంకట్రావుకు ఇద్దామనే ఉద్దేశ్యంతో వెంకట్రావు ఇంటికి వస్తాడు. నర్సయ్య అడుగుపెట్టే సరికి వెంకట్రావు ఎస్టేటు జప్తులో ఉంది. ఈ కుటుంబ, ఎస్టేటు వ్యవహారాలన్నీ ఆమూలాగ్రం తెలిసిన గుమస్తా కామేశం. జమిందారీ నగల తాకట్టు విషయంలో కామేశం నర్సయ్యకు దొరికిపోతాడు. నర్సయ్య, కామేశం ఇద్దరు ఒక అంగీకారానికి వచ్చి ఆ సొమ్మంతా కాజేస్తారు. వెంకట్రావు శాంతని ప్రేమిస్తాడు. కానీ అకస్మాత్తుగా నర్సయ్య, శాంతలు ఆ ఇల్లు వదిలి వెళ్ళిపోతారు. 'ఇది జాలిలేని లోకం. మానవలోకం అనే ఈ మార్కెట్టులో ఎవడి జాగ్రత్తలో వారుండాలి. ఎవడి లాభం వాడు చూసుకోవాలి' అని ఆలోచించి సిగ్గు, లజ్జా విడిచి పెట్టి వెంకట్రావు కాంట్రాక్టరుగా ఎదుగుతాడు. వెంకట్రావు ఒక రోజు సుబ్బయ్య ఇంటికి వచ్చి 'అర్జంటుగా ఓ ఐదు వందలు, కావాలోయ్' అని అడిగి, ఆ ఐదు వందలు కాంట్రాక్టరు గవరయ్య ద్వారా సంపాదించి తనకు ఇవ్వమని బావ సుబ్బయ్యకి ఉపాయం చెప్తాడు.

నలభై సంవత్సరాల గవరయ్య చాలా గంభీరంగా ఉంటాడు. రామయ్యమ్మతో గవరయ్యకు పెళ్ళి చేసింది గంగమ్మ. తల్లి గంగమ్మ చనిపోయే సరికి గవరయ్య పరిస్థితి బజార్న బడ్డట్టయ్యింది. గవరయ్య నాలుగోఫారం వరకే చదువుకున్నాడు. తాలుకా ఆఫీసులో బంట్రోతుగా పని చేసే నూకరాజు గవరయ్యకు ప్రాణ స్నేహితుడు. నూకరాజు గవరయ్యకు తాలూకా ఆఫీసులో అటెండర్ ఉద్యోగం రావటానికి బాగా సహాయం చేస్తాడు. గవరయ్య ఒక రోజు తాసీల్దారుకి తన ఇంటిని చూపిస్తే, ఆ తసీల్దారు గవరయ్య ఇంటి కంటే అతని ఇల్లాలు బాగుందనుకొని ఆ తరువాత ఆమెతో కామక్రీడ వెలగబెడుతున్న సమయంలోనే, గవరయ్య ఇంటికి రావటం జరుగుతుంది. భార్యని నరికేస్తానని కోపంతో ఊగిపోతున్న గవరయ్యకు నూకరాజు సలహా చెప్పటమే గాదు, తాసీల్దారు నుండి డబ్బులు గుంజుకునే ఉపాయం కూడా చెప్పి అతన్ని చల్లబరుస్తాడు. అప్పటి నుండి గవరయ్య జీవితం మలుపు తిరుగుతుంది. అలా ఎదిగిన గవరయ్య ద్వారా ఐదువందలు తీసుకొని సుబ్బయ్య, వెంకట్రావుకిస్తాడు. ఈ ఐదు వందల వ్యవహారం సుబ్బయ్య జీవితానికి పెద్ద గుదిబండలా తయారవుతుంది. ఈ సంఘటనను ఆధారంగా జేసుకొని చాలా కథ నడుస్తుంది.

సుబ్బయ్య జీవితంలో మనోరమ పరిచయం ఓ మలుపు. మనోరమ వలనే సుబ్బయ్య ఆలోచనా పరిధిలో విస్తృత పరిణామాలు చోటు జేసుకుంటాయి. మనోరమ టీచర్.

గవరయ్య దగ్గర తీసుకున్న డబ్బుల విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండమని అవధాని, సుబ్బయ్యకు సూచనలిస్తాడు. 'ఇహ నువ్వు చూస్తే ఓ వెర్రి పీరువి' అని కూడా అవధాని సుబ్బయ్యనంటాడు.

ఎప్పుడూ ఆఫీసుకు ఆలస్యంగా రాని సుబ్బయ్య, కూతురు కమలను ఆసుపత్రికి తీసుకెళ్ళి రావటం వలన ఒక్క రోజు ఆలస్యంగా వచ్చేసరికి హెడ్ గుమస్తా సుబ్బయ్యను తీవ్రంగా అవమాన పరచటమే గాకుండా 'కాంట్రాక్టర్సు దగ్గరకు పోయి చెయ్యచాపుతావు. డిస్మిస్ అయిపోతావు' అని కూడా నలుగురు ముందు అరిచి, ఎకౌంట్స్ సీటు నుండి మళ్ళీ సుబ్బయ్యను డిస్పేచ్ సీటుకు మార్చి ఘోరంగా అవమాన పరుస్తాడు. ఈ సమయంలో సుబ్బయ్య చిగురుటాకులా గజగజ వణికి పోతాడు. అవధాని, సుబ్బయ్యను కొంత ఓదార్చి ధైర్యం చెపుతాడు.

బాధపడుతూ ఇంటికొచ్చే సరికి పోతన్న సుబ్బయ్య కోసం ఎదురుచూస్తూ కనిపిస్తాడు. 'గవరయ్య మీరివ్వాల్సిన ఐదువందలు ఎప్పుడిస్తారో తెల్సుకురమ్మన్నారండి' అని చెప్పి వెళ్తాడు పోతన్న. ఒక రోజు గవరయ్య సుబ్బయ్యను కారులో కూర్చొనే ఐదువందల విషయమై బెదిరించి 'పది రోజులే గడువు; ఈ లోపున యివ్వక పోయావా చూస్కో తమాషా' అని హెచ్చరించి నడిరోడ్డులో అవమాన పరుస్తాడు. అ తరువాత వెంకట్రావు కనబడి సుబ్బయ్యను 'చచ్చుపెద్దమ్మ' బిరుదుతో పలకరించి, ఆ గవరయ్య డబ్బులు వారంలో సరిపెడదామని చెప్తాడు. కాని ఎన్నిసార్లు సుబ్బయ్య వెంకట్రావు ఇంటికి వెళ్ళినా లేడనో, ఊరెళ్ళాడనో – ఇలాంటి సమాధానాలే గాని, వెంకట్రావు సుబ్బయ్యకు కనబడనే లేదు. ఒకరోజు అనుకోకుండా వెంకట్రావు దర్శనమయ్యింది సుబ్బయ్యకు. 'ఇంకా కొన్నాళ్ళు గవరయ్యను ఆగమను. అంతగా ఆగలేకపోతే చావమను. ఇవ్వనని చెప్పు. దిక్కున్న వాడితో చెప్పుకోమను' – ఇలాంటి సమాధానం చెప్పాడేగాని, వెంకట్రావు సుబ్బయ్యకు డబ్బులిచ్చి పంపలేదు.

'మనిషన్న ప్రతివాడు నాశనం కావాలి' అనేంత తీవ్ర మానసిక వేదనకు గురవుతాడు సుబ్బయ్య. రాత్రి వంతెనపై కూర్చొని మనస్సు బాధగా మూలుగుతున్నప్పుడు మనోరమ కనిపించి మాట్లాడటం సుబ్బయ్యకు ఉపశమనంతోపాటు సంతోషం కలిగిస్తుంది. ఈ లోకంలో సుబ్బయ్య మీద కూడా జాలిపడే వారున్నారనే తలంపు సుబ్బయ్యలో బతుకు తీపిని కలిగిస్తుంది. మనోరమ కౌగిలిలో సుఖిస్తాడు. ఆ తరువాత రోజు మనోరమ గురించి, గవరయ్య గురించి సుబ్బయ్య ఆలోచిస్తుండగా పోతన్న, సుబ్బయ్య దగ్గరకొచ్చి తాను గవరయ్య దగ్గర పని చెయ్యటం మానేశానని చెప్పి, గవరయ్యకు సొమ్మివ్వనని చెప్పమని సలహా ఇస్తాడు. ఆ ఆలోచనతో కాసేపు ధైర్యంగా ఉంటాడే గాని మళ్ళీ అధైర్యంలో పడతాడు సుబ్బయ్య. వెంకట్రావు గూడా సుబ్బయ్యను కలిసి గవరయ్యకు డబ్బులివ్వనని చెప్పమని ప్రోత్సహిస్తాడు.

గవరయ్య బెదిరించిన సంగతి సుబ్బయ్య అవధానికి చెప్తే అవధాని మండి పడి, అసలు గవరయ్యకు డబ్బులు ఇవ్వనని చెప్పు, ఆ తరువాత జరిగే సంగతి నేను చూసుకుంటానని చెప్తాడు. సుబ్బయ్య ఎన్నో ఆలోచనలతో ఇంటికి జేరేసరికి, గవరయ్య మనిషి పోతరాజు వచ్చి గవరయ్య గారు డబ్బులిప్పించుకు రమ్మన్నారని, ఇవ్వకపోతే తడాకా చూపిస్తానని చెప్పమన్నారని అంటాడు. అప్పుడు 'నేను యివ్వలేను, ఇవ్వను, ఇచ్చుకోలేను మరి' అని పోతరాజుతో ధైర్యంగా సుబ్బయ్య చెప్పటం ఒక మలుపు. ఆ తరువాత సుబ్బయ్య మనోరమ ఇంటికి వెళతాడు.

మనోరమ, సుబ్బయ్యలు ఆలింగనాలతో ఆనందిస్తారు. గవరయ్య బాధ వదిలిందని, అది చెప్పటానికే తాను వచ్చినట్లు మనోరమకు చెప్పి, సుబ్బయ్య వెళ్ళి పోతుండగా, రేపు సాయంకాలం రండి చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలని మనోరమ చెప్తుంది. గవరయ్య, ఆయన మంది మార్బలం సుబ్బయ్యపై దౌర్జన్యం చేసి, ఇవ్వవలసింది ఐదు వందలయితే వెయ్యికి సుబ్బయ్య చేత బలవంతంగా నోటు రాయించుకుంటారు. తన చిన్నప్పుడు తండ్రిని దొంగలుగొట్టిన సన్నివేశం జ్ఞాపకానికి వస్తుందీ పరిస్థితుల్లో సుబ్బయ్యకు.

ఈ సంఘటన జరిగిన మరుసటిరోజు సుబ్బయ్యలో గలిగిన సదాలోచన ఆయనలో చైతన్యం కలగటానికి దారి తీసింది. 'భయం ప్రతివాడికి ఉంటుంది' – ఇదీ సుబ్బయ్యలో గలిగిన చైతన్యం. ఆ పిమ్మట గవరయ్య తనను జుట్టు పట్టుకొని అవమాన పరచిన సంఘటన వివరాలను పోతన్నకు, అవధానికి, వెంకట్రావుకు, మనోరమకు సుబ్బయ్య అందజేస్తాడు.

మనోరమ, ఆ ప్రోనోట్ పోతరాజు ద్వారా సుబ్బయ్యకు అందేలా చేస్తుంది. ఆఫీసులో అవధాని బిల్లు విషయంలో ఎదురుతిరగటం కూడా గవరయ్య సుబ్బయ్యకు నోటు ఇచ్చేలా దోహదపడింది.

గవరయ్య పూర్వపు భార్య రామయ్యమ్మ ప్రస్తుతం వెంకట్రావుని అంటి పెట్టుకొని ఉంటుంది. ఆమెను గవరయ్య చూచేలా వెంకట్రావు చేసేసరికి, గవరయ్య విపరీతమైన మానసిక ఒత్తిడికి గురవ్వటం జరుగుతుంది.

బీచ్ దగ్గర సుబ్బయ్య మనోరమ కోసం ఎదురు చూస్తూ తనకుధైర్యాన్ని కలిగించిన మనోరమ గురించి మానవత లేకుండా ఆలోచించటమే గాకుండా ఎదుటి వాళ్ళు ఏమైపోయినా మనం 'సేఫెస్ట్' పొజిషన్లో ఉండాలని ఆలోచనకొస్తాడు సుబ్బయ్య. 'ముప్పై ఐదేళ్ళకీ మూల సూత్రం (సేఫెస్ట్ మార్గం) బోధపడిందని సుబ్బయ్య భావిస్తాడు. ఎవరేమైపోయినా మనకనవసరమనే దగుల్బాజీ ఆలోచనకొస్తాడు సుబ్బయ్య. తన జీవిత సంఘటనల చీకటిని గుర్తుకు తెచ్చుకునే సరికి సుబ్బయ్యకు శైశవం, బాల్యం, యౌవనం, అంతా ఒక్కలా కనిపిస్తుంది. అయితే మనోరమ సాహచార్యం వలన పొందిన నూతన వెలుగు రేఖలు సుబ్బయ్య జీవిత రేఖలను మార్చివేశాయి. అయినా సుబ్బయ్య

మనోరమను సరిగా స్వీకరించలేదు. "ఈ నవల చివరి భాగాలు రాస్తున్నప్పుడే నాకు సుబ్బయ్యంటే అసహ్యం వేసింది. గవరయ్య చెప్పినట్టు, వాడు దొంగ వెధవేననే నమ్మకంతో వుండి పోయాను"[8] అని చెప్పిన రావిశాస్త్రి మాటలు గమనార్హం. అయితే సుబ్బయ్యలో కలిగిన పరిణామం మంచికి దోహదపడాలని ఆశిద్దాం.

పాత్రల చిత్రణ :

రైతు పొలం సారాన్నిబట్టి ఋతుక్రమాన్ని అనుసరించి పైరుని ఎన్నుకుంటాడు. అలానే నవలా రచయిత కూడ ఇతివృత్తాన్ని, సామాజిక కాలమాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పాత్రలను సృష్టించుకుంటాడు. తాను స్వీకరించిన ఇతివృత్తం రక్తిగట్టాలంటే, అయా సన్నివేశాలకు అనుగుణమైన పాత్ర చిత్రణ కూడ సమర్థంగా, సామాజిక జీవన గమనాన్ని ప్రతిబింబించేట్టుగా సాగాలి. మనిషి ఆకారాన్ని బట్టి వస్త్రకొలతలు, కుట్టు, వస్త్రధారణ ఉండేట్టుగానే, ఇతివృత్తానికనువైన పాత్ర పోషణ నిర్వహింపబడటం దర్జీపనిలోని మెలకువలను పాటించటం లాంటిది. మొత్తం రూపనిర్మాణ శిల్ప బాధ్యతను రచయిత జాగరూకతతో పోషించుకోవాలి. పాత్రపోషణ నిర్వహణారీతుల్లో కాలానుసారంగా ఎన్నో మార్పులు చోటుజేసుకున్నాయి. వ్యక్తిగత గీతల బరినుండి నవలేతి వృత్తాలు విశాలసామాజిక ప్రాపంచిక దృక్పథాన్ని అలవరచుకున్నాయి. వ్యక్తి సంస్కారం నుండి సంఘ చైతన్యం వైపు నవలలు నడిచాయి. ఈ మార్పుని తెలుగు సాహిత్యంలో ప్రముఖంగా స్వాతంత్ర్యానంతర రచనలలో గుర్తించగలం. ఈ మార్పుకు కొంతమేర ఆంగ్ల, రష్యన్, బెంగాలీ, హిందీ అనువాద రచనలు కూడ తోడ్పడ్డాయి. 1950 నుండి తెలుగు నవలా సాహిత్యం నూతన మార్పు వైపు దృష్టి మళ్ళించిందని చెప్పవచ్చు.

"ఏ వ్యక్తి భావాలు స్థిరంగా, మార్పు చెందకుండా ఉండవు. తాము దేశకాలాలను మార్చుతూ, దేశ కాలాల ప్రభావం చేత తాము మార్పు చెందుతూ, భావాలు ముందుకు సాగుతూ ఉంటాయి. కాబట్టి గొప్ప పాత్రలు నిశ్చితమైన దేశకాలాలను కలిగి ఉంటాయి. దేశకాలాల నుంచి వేరు చేయగలిగిన పాత్రలు వ్యాపార నవలల్లో మాత్రమే ఉంటాయి. కాబట్టి నవలా సాహిత్యంలోని గొప్ప పాత్రలు సమకాలీన సామాజిక భావజాలంలో నుంచి ఉద్భవించినవిగా, వ్యక్తిత్వాన్ని, మానసికమైన లోతునూ కలిగినవిగా ఉంటాయని మనం గుర్తించాలి"[9] అని వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు పేర్కొన్నారు. అందువలన సమకాలీన సామాజిక స్థితిగతులను సానబట్టి, మరీ రాటుదేలి వచ్చిన పాత్రలేగాని రావిశాస్త్రి పాత్రలు మరోరకమైనవిగావు. స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి మూడు పదులు దాటని వయసులో ఉన్న రావిశాస్త్రి అప్పటికే పది సంవత్సరాల రచనా అనుభవాన్ని గడించారు. మారిన ప్రాపంచిక పరిస్థితులను, రాజకీయ ఆర్థిక దృక్పథాన్ని, నడుస్తున్న చరిత్రను సమతూకంలో అవగాహన చేసుకుని రచనా వ్యాసంగానికి పూనుకున్నారు. కాబట్టే ఆయన నవలేతి వృత్తాలుగాని, నవలా పాత్రలుగాని సమకాలీన సామాజిక భావజాలం నుండి వేరుబడకుండా ఉన్నాయి.

ఆర్థిక అసమానతలున్నంత కాలం సామాజిక వర్గాలుంటాయి. వర్గాలున్నంత కాలం వర్గ సాహిత్యం పుడుతూనే ఉంటుంది. పీడిత, శ్రామిక, అణగారిన ప్రజాపక్షం వహించే ప్రగతి కాముక రచయితలు పాలిత ప్రజల పక్షం నిలబడి పాలక వర్గంపై తమపెన్నును గన్నులా ఎక్కుబెడతారు. రావిశాస్త్రి పాత్రలు గూడ హెచ్చుభాగం వర్గదృక్పథంతో పాలక వర్గకుహనా సంస్కృతిని నిరసించేవే. శాస్త్రి నవలల్లో శ్రామిక, న్యాయ, పోలీసుశాఖల ప్రాతినిధ్యపు పాత్రలు, సోషలిస్టు, మార్క్సిష్టు దృక్పథంగల పాత్రలు, చైతన్యంతో తిరగబడే పాత్రలు, మానవత్వానికి నీరాజనాలందించే పాత్రలు, దుర్మార్గానికీ, దురహంకారానికీ, డబ్బుకీ ప్రతీకలైన విభిన్న పాత్రలు దర్శనీయమవుతాయి.

మనో విశ్లేషణ లేక చైతన్య స్రవంతి పద్ధతిలో అల్పజీవి నవలే తివృత్తం నడిచింది. ముఖ్యంగా ఆడ్లర్ సూత్రీకరించిన ఆత్మన్యూనతా భ్రాంతి (Inferiority Complex) కి అల్పజీవి అద్దం బడుతుంది. అందుకే "చైతన్య స్రవంతి శిల్పాన్ని ఉపయోగించి రచింపబడిన తెలుగు నవలల్లో 'అల్పజీవి' మొట్టమొదటిది"[10] అని పేర్కొనబడింది. ఈ సిద్ధాంతానికి ముఖ్యప్రతీక దీనిలోని సుబ్బయ్యపాత్ర.

1.సుబ్బయ్య :

ఒక పాత్ర అంతర్గత ఆలోచనా స్రవంతిని బట్టి లేక అతని మనస్తత్వ విశ్లేషణా ధోరణిని బట్టి పాత్రను అంచనా వెయ్యటం చైతన్య స్రవంతిలోని ముఖ్య అంశం. అల్పజీవిలోని సుబ్బయ్య తన నీడను తాను నమ్మలేదు. తనకేమాత్రం ఆత్మ ప్రత్యయం లేదు. అతని భార్య సావిత్రిగాని, పిల్లలుగాని అతనికి ఏనాడు సముచిత గౌరవం ఇవ్వలేదు. మనోరమ సాహచర్యమే సుబ్బయ్య జీవిత గమనాన్ని మలుపుదిప్పింది.

సుబ్బయ్య 'ఇనెఫిషెంట్' అని, 'వెర్రిపీరు' అని ఆఫీసు వాళ్ళ అభిప్రాయం. తన భర్త చవట దద్దమ్మని, అసలు తనకు భర్తగా ఉండటానికే అసమర్థుడని సుబ్బయ్య భార్య సావిత్రికి గట్టి నమ్మకం. ఎందుకు పనికిరాని ఆధైర్యస్తుడని సుబ్బయ్యపై వెంకట్రావు అభిప్రాయం. ఇల్లొక నరకం, ఆఫీసొక నరకం, నా మనసొక నరకం అని, ఈ లోకంలో తానొక పనికిరాని వెధవనని, తనపై జాలిపడే వాళ్ళుగాని, సహాయం అందించేవాళ్ళుగాని ఎవరూలేరని సుబ్బయ్య తన గురించి బాధపడతాడు. ఈ అభిప్రాయాలననుసరించి సుబ్బయ్య ఎలాంటివాడో, అతని జీవిత పునాది దేనిమీదుందో తెలుసుకోవచ్చు. నిత్యం భయం, భయం ఇదీ సుబ్బయ్య అస్తిత్వం.

తల్లి చిన్నప్పుడే చనిపోవటం వల్ల, సవతితల్లి సుబ్బయ్యను రోజూ కొట్టి హింసించటం, తండ్రిని ఒకరోజు దొంగలు కొట్టి దోచుకోవటం, ఆ సన్నివేశాన్ని తాను కళ్ళారా చూడటం ఈ సంఘటనలు సుబ్బయ్య జీవితంపై చిన్ననాడే బలమైన ముద్రను వేశాయి. అందుకని ప్రతి సన్నివేశానికి చిరుగాలికి అల్లల్లాడే వగిడాకులా వణికిపోవటం, విపరీతంగా భయపడటం సుబ్బయ్య జీవితంలో భాగమయ్యాయి. భయం పుట్టుకతో లేకపోయినా పరిసరాల ప్రభావం వల్ల ఆ విషపు కోరల్లో ఇరుక్కుపోయాడు సుబ్బయ్య.

“మనుషుల ప్రవర్తనలకు కారణాలుంటాయని, ఆ కారణాలు తెలిసినప్పుడే వాళ్ళ ప్రవర్తనను అర్థంజేసుకోవటానికి, సానుభూతి చూపించటానికి సంస్కరించటానికి వీలుంటుంది”[11] అని ఫ్రాయిడ్ అభిప్రాయ పడతాడు. ఈ ఆలోచన వాస్తవమైనది. దీనిని ఒక్క సుబ్బయ్య జీవితానికే కాదు, సామాజిక వ్యక్తుల ప్రవర్తన కంతటికి అన్వయించవచ్చు. రావిశాస్త్రి అల్పజీవిలో సుబ్బయ్య పాత్ర ద్వారా వ్యక్తం చేసింది కూడ ఈ భావనే. అయితే ఆడ్లర్, ఫ్రాయిడ్ కంటే మరోమెట్టు ముందుకువెళ్ళి “ప్రయోజనాన్ని బట్టి మానవ ప్రవర్తన ఉంటుందని, ఏ ప్రయోజనాన్ని ఆశించి మనిషి అట్లా ప్రవర్తిస్తున్నాడో అర్థం చేసుకోవటం ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుందని”[12] చెప్పటమే కాక, సదాచరణ వైపు మనిషిని మళ్ళించాలని సూత్రీకరించారు. సుబ్బయ్యలోని అవక తవకాలోచనాక్రమాన్ని, స్వార్థపూరిత ధోరణిని సంస్కరించి, సాంఘిక ప్రయోజనంవైపు, సాటి మనుషులకు సాయపడదామనే సదాలోచనవైపు, రావిశాస్త్రి సుబ్బయ్య పాత్రను నడిపించారు. సుబ్బయ్య ప్రవర్తనను, అతని ఆలోచనలను రచయిత అసహ్యించుకొని, అతనిని కూడా 'ఓ దొంగవెధవే' నని అనుకున్నప్పటికీ, నవల చివరలో అతనిలో మంచి పరిణామం కలిగినట్టు శాస్త్రి సూచించారు.

తనలో తీరకుండా, అణగారిన ఆలోచనలను సుబ్బయ్య దోవనబొయ్యే మనుషులను చూచి, వాళ్ళపై ఆరోపణ చేసుకొని తద్వారా తన ఆలోచనా క్రమాన్ని వ్యక్తం చెయ్యటం కూడ చైతన్య స్రవంతిలో భాగం. బడిపిల్లలను, ఎర్ర చీర మనిషిని, ఇంకా ఇతరులను చూసినప్పుడు సుబ్బయ్య వ్యక్తంజేసిన ఆలోచనలు ఈ ధోరణి కిందకు వస్తాయి. సుబ్బయ్యలో పిరికితనం, భయం జాస్తి. వెంకట్రావు కోసం గవరయ్యను ఐదువందలు ఆడగటానికి ఎంతో కష్టపడి పోతాడు. అవధాని హెచ్చరికతో సుబ్బయ్య మరీ దిగులు పడతాడు. హెడ్ క్లర్క్ హూంకరింపుతో సుబ్బయ్య నవనాడులు కుంగిపోతాయి. తనకెవ్వరూ సహాయం చేసేవాళ్ళు లేరనే అభద్రతా భావం, అందరూ తనను అపహాస్యం చేస్తున్నారనే చులకన తలంపు అతనిలో ఆ క్షణం కలగటం సహజమే. గానుగెద్దులా సుబ్బయ్య మనసు ఆ సన్నివేశపు సర్కిల్ నుండి బయట పడలేక విలవిల్లాడింది. ఈ సన్నివేశ చిత్రీకరణ రావిశాస్త్రిలోని పరిశీలనా దృష్టిని ఇనుమడింపజేస్తుంది. సుబ్బయ్య మనస్తత్వాన్ని, ఆలోచనా స్రవంతిని, పాయలు పాయలుగా ఎత్తుపల్లాలతో మలుపులు తిప్పి, పరవళ్ళుగా పొంగించి, దూకించి, పారించి ప్రవహింపజేసిన తీరు హృదయాలను హత్తుకుంటుంది.

భయంలో భగవంతుడు గుర్తుకురావటం సర్వసాధారణం. సుబ్బయ్య పూరీ జగన్నాథుడికి మొక్కుకుంటాడు. సాక్షాత్తు జగన్నాథస్వామి వచ్చి 'నీ వేణి ఇస్తే నీ భర్త ఆపద తప్పుతుంది' అని చెప్పినా సావిత్రి తలనీలాలు ఇవ్వదని 'నేను బతికివున్న ఒక్కటే, చచ్చినా ఒక్కటే దానికి' అని నిరాశతో, అసంతృప్తితో సుబ్బయ్య అన్న మాటలు భార్య సావిత్రి పట్ల అతనికి ఏ విధమైన భావం ఉందో తెలియజేస్తాయి.

ఈ పరిస్థితుల్లో ఏ వ్యక్తి అయినా అందర్నీ అసహ్యించుకోవడం, ద్వేషించటం అనే ఆలోచనకు లోనవుతాడు. సుబ్బయ్య కూడా మొత్తం సమాజాన్ని ద్వేషిస్తాడు. ఈ లోకమంతా కనికరం లేనిదని, అందుకని మొత్తం సర్వనాశనమవ్వాలని, ముందుగా తన బాధలకి కారకుడైన గవరయ్య చావాలని అనుకుంటాడు. రావిశాస్త్రి మానవ స్వభావాన్ని ఇక్కడ చాలా నేర్పుగా వివరించాడు. ఈ సన్నివేశ చిత్రీకరణ స్వాభావికమైంది.

గవరయ్య బృందం ఐదువందలు ఇవ్వనందుకు సుబ్బయ్యను చితగ్గొట్టి, వెయ్యిరూపాయలకు నోటు రాయించుకున్నప్పుడు 'అందర్నీ అడిగానని చెప్పు' అనే అప్పగింతల పరిస్థితికి లోనవుతాడు సుబ్బయ్య. అప్పుడు 'బాధ నిజం, చావు నిజం, మనిషి మాట అబద్ధం' అనే సుబ్బయ్య ఆలోచనా తరంగాలను అలాంటి పరిస్థితిలో ఒక బిక్కజీవి ఎలా ఆలోచిస్తాడో రావిశాస్త్రి సమర్థంగా చిత్రీకరించారు.

అయితే 'భయం ప్రతివాడికి ఉంటుంది' అనే ఆలోచన సుబ్బయ్యలో కలగటం కారుచీకటిలో కాంతిరేఖ లాంటిది. గవరయ్య ఆఫీసులో తనని డబ్బు అడగటానికి భయపడతాడు, కనుక భయం సర్వసాధారణం అనే ఓదార్పుకు వచ్చి జరిగిన విషయం సుబ్బయ్య అందరికీ చెప్తాడు. ఈ సన్నివేశమే సుబ్బయ్య జీవితాన్ని మరో మలుపు దిప్పింది. మనోరమ సాహచర్యం, సాన్నిహిత్యం వలన సుబ్బయ్య జీవితం కొంతవరకన్నా మబ్బు విడిచిన వెన్నెలయ్యింది.

"ఏదైనా బోధపరచుకోవాలంటే దానికి కారణం తెలుసుకో అన్నాడు, చిన్నప్పుడు సైన్సు మాస్టారు"[13] అని హేతుదృష్టితో, కార్యకారణ సంబంధంతో ఆలోచించాలనే నూతన పరిణామ కాంతి మెరుపులా సుబ్బయ్య బుర్రలో లిప్తపాటు తళుక్కుమన్నట్లుంది. అందుకని గవరయ్య, వెంకట్రావు, మనోరమలు సుబ్బయ్య దృష్టి పథంలో మెదిలారు. మనోరమ గురించి కూడ సందేహాస్పద ఆలోచనలు సుబ్బయ్యలో మెదలి ఒక పొంతనలేకుండా అవి సాగటం అతని అపరిపక్వస్థితికి నిదర్శనం.

శాంతి, విశ్రాంతి తనకు కరువయ్యాయని, భయం, క్షోభ తనను పీడిస్తున్నాయని, చచ్చేంత వరకు ఈ పీడన తప్పదని, అయినా చావటం పరిష్కారం కాదనే ఆశ, సదాలోచన సుబ్బయ్యలో అంకురించటం చైతన్యానికి ప్రతీక. 'కనిపిస్తోందామె నడిచే వెలుగులా' అని రావిశాస్త్రి వెలుగునిచ్చే మార్గదర్శకురాలిగా మనోరమను చిత్రీకరించబట్టే సుబ్బయ్య లాంటి కూపస్థమండూకాలకు లోకస్థితి అర్థమవటానికి మార్గం ఏర్పడుతుందని భావించాలి. తనేమిటో, ఎక్కడున్నాడో, సంఘంలో తన స్థానమేమిటో తరిచి చూసుకుంటే 'శైశవం, బాల్యం, యౌవనం, అంతా ఒక్కలా ఉంది' అంటే సుబ్బయ్య జీవితం ఇప్పటి వరకు గానుగెద్దు జీవితంలా గడిచిందేగాని, ఏమాత్రం మార్పురాలేదనే ఆలోచన ఇన్నాళ్ళకు సుబ్బయ్యకే తట్టింది. ముప్పైయ్యయిదేళ్ళకీ మూల సూత్రం సుబ్బయ్యకి బోధపడింది. సుబ్బయ్యకి తన ఆస్తిత్వం (Existence) తెలిసింది కాబట్టి ఇదే అతనికి చైతన్యం వైపు (Consciousness) దారి చూపిస్తుంది. అస్తిత్వమే చైతన్యానికి మూలమనే సూత్రం సుబ్బయ్య జీవితానికి అన్వయిస్తుంది.

'దాసోహం, దాసోహం – ఇలా ఇప్పటి వరకు సుబ్బయ్య జీవితం గడిచింది. ఇంకా జీవితం హీనంగా, నీచంగా, క్షుద్రంగా, దౌర్భాగ్యంగా, దైన్యంగా గడిచింది. అందుకనే ఆ చీకటి వెనక్కి పీకుతుంది. నూతనంగా పొందిన చైతన్య స్ఫూర్తి ఈ వెలుగు ముందుకు లాగుతోంది సుబ్బయ్యని' అని రావిశాస్త్రి ఆ సుబ్బయ్య జీవిత పరిణామ దశను తులనాత్మకంగా సూచించారు. సుబ్బయ్యలో భయం, స్తబ్దత తొలగిపోయి చైతన్య స్రవంతి, నూతన స్ఫూర్తి, సామాజిక చైతన్యం చోటు జేసుకున్నాయి. భయం పునాదుల నుండి అభద్రతా భావపు ఆలోచనా ధోరణి నుండి సుబ్బయ్య బయటపడి చైతన్యపు వెలుగుబాట వైపు తొంగి చూశాడని మొత్తం సుబ్బయ్య జీవితాన్ని విశ్లేషించుకుంటే అర్థమవుతుంది.

2. గవరయ్య :

గవరయ్య తండ్రి రంగూన్ వెళ్ళి మరి తిరిగిరాలేదు. తల్లి గంగమ్మ ఇతణ్ణి ఆదరణతో పెంచింది. గవరయ్య చాలా పేద కుటుంబం నుంచి ఎదిగాడు. గవరయ్యకు చదువు అబ్బలేదు.

గవరయ్య పదిహేనవ ఏట ఫస్టు ఫారంలో చేరితే, అదే ఏడు గంగమ్మ రామయ్యమ్మనే అమ్మాయితో గవరయ్యకు పెళ్ళిజేసింది. పందొమ్మిదో సంవత్సరానికి గవరయ్య నాలుగో ఫారంలోకి వచ్చాడు. అప్పటినుంచి గవరయ్య, రామయ్యమ్మతో దాంపత్య సుఖం అనుభవిస్తు హాయిగా ఉన్నాడనుకునేసరికి గంగమ్మ మరణిస్తుంది. తల్లి చనిపోవటంతో గవరయ్య అనాథ అవుతాడు. తనతో పాటు చదువుకొని, తాలూకా ఆఫీసులో బంట్రోతుగా ఉన్న సూకరాజు గవరయ్యకు మంచి స్నేహితుడు. సూకరాజు సాయంతో గవరయ్య తాలూకా ఆఫీసులో అటెండరుగా చేరుతాడు.

ఒకరోజు గవరయ్య తాశీలుదారుకు తన ఇంటిని చూపిస్తే ఆయన ఇంటితోపాటు గవరయ్య భార్యను కూడా చూసి 'చక్కటి చుక్కని సంపాదించేవుర' అని మెచ్చుకుంటాడు. ఆ తరువాత రామయ్యమ్మతో ఆ తాశీలుదారు కులుకుతున్న దృశ్యాన్ని గవరయ్య కళ్ళారా చూసి చనిపోదామని సముద్రం దగ్గరకు వెళ్తాడు. ఏ ఎండకా గొడుగు పట్టగల, లోకతత్వం వంటబట్టించుకున్న నూకరాజు గవరయ్యను ఓదార్చి, తాశీలుదారుతో మాట్లాడి, గవరయ్యకు రెండు వందలు ఇప్పించి, వ్యవహారిన్ని కొద్దిగా తగువు పెట్టినట్టు పెట్టి సర్దుతాడు. ఈ రెండు వందలకు రుచి మరిగిన గవరయ్య, రామయ్యమ్మను చంపుతానన్న మాట మరిచి అక్కణ్నుంచి డబ్బు దాహంతో పరుగులు దీస్తాడు. ఈ సన్నివేశం గవరయ్య జీవితాన్ని మలుపు తిప్పుతుంది. ఆ రోజే రామయ్యమ్మను పుట్టింటికి పంపుతాడు. రావిశాస్త్రి ఈ సన్నివేశ సందర్భంలో 'కత్తికి కనికరం తక్కువ' అని వివరించారు. నలభై ఏళ్ళ గవరయ్య పెద్ద కాంట్రాక్టరై గవరయ్యగారుగా రూపొందాడు. తాలూకా ఆఫీసులో ఏ పనికీ గవరయ్యకి ఎదురులేదు. సుబ్బయ్య వద్ద తన బిల్లులు ఉన్నాయి కాబట్టి అడగ్గానే గవరయ్య ఐదువందలు ఇంటికి పంపించాడు. కాని ఇదే గవరయ్య, సుబ్బయ్య ఆ సీటు నుండి మారగానే అతనిని బెదిరించి, మరోసారి కొట్టి ఐదువందలకు బదులు వెయ్యి రూపాయలకు నోటు రాయించుకోవడం అతని దౌర్జన్యానికి, దుర్మార్గత్వానికి నిదర్శనం. తాను చేస్తున్న వ్యాపార సంబంధాలలో గవరయ్య లాంటి పాత్ర అలా ప్రవర్తించటం ఆశ్చర్యమేమిగాదు.

ఆఫీసులో అవధాని, గవరయ్య, సుబ్బయ్యను కొట్టించినందుకు, నోటు రాయించుకున్నందుకు నిరసనగా బిల్స్ పాస్ చేయకుండా ఉండటం, తన ఊరి అమ్మాయి మనోరమ సుబ్బయ్య పక్షాన వచ్చి నోటు విషయం అడగటం, మార్గాలన్నీ తెలిసిన పోతన్న ఉద్యోగం మానెయ్యటమే కాకుండా విభీషణుడిలా సుబ్బయ్య పంచన చేరటం, వెంకట్రావు తన పాత విషయాలు బయట బెడతానని బీరాలు పలకటం ఇవన్నీ గవరయ్యను సుబ్బయ్య చేత బలవంతంగా రాయించుకున్న నోటుని అతనికి ఇచ్చి వెయ్యటానికి దోహదపడ్డాయి. ఆయా సన్నివేశాన్ని బట్టి రకరకాల ఒత్తిళ్ళు ఒక వ్యక్తిపై ఎలా పనిజేస్తాయో రావిశాస్త్రి గవరయ్య పాత్రద్వారా తెలిపారు.

ఈ విషయాలన్నీ ఆలోచించే సరికి గవరయ్యకి తలనొప్పొచ్చింది. రామయ్యమ్మ విషయంలో ఆనాడు సముద్రం ఒడ్డున కూర్చున్నప్పటి స్థితి దాపురించినట్లయింది. అందుకని "గతం చచ్చిందనుకున్నాను. కాని బతికే ఉంది. నన్ను చంపుకు తింటుంది. అబ్బా తలనొప్పి"[14] అని గవరయ్య అనుకోవడం  ఇడ్, ఇగో, సూపర్ ఇగోల సూత్రాన్ని గుర్తుజేస్తుంది. గతం ఎక్కడో లోలోపల పొరల్లో అణగారి ఉన్నప్పటికి, అది పూర్తిగా మాసిపోలేదు కాబట్టి, ఆ సన్నివేశ తీవ్రతని బట్టి అది బయటకొచ్చింది. తన జీవితాన్నే మలుపు తిప్పిన సన్నివేశం కనుక అది అంత తొందరగా అణగారి పోలేదు. అందుకే అతనికి తలనొప్పి.

ఈ సన్నివేశంలో గవరయ్య అనుభవించే మనోవేదన చైతన్య స్రవంతికి మంచి ఉదాహరణ. "రచయిత బాహ్య ప్రకృతి నుండీ, లేక బాహిరమైన ప్రవర్తన నుండి తనదైన వైయక్తిక ప్రపంచపు రెపరెపలాడే పల్చటి నీడల్లోకి మలగి పోవటమే చైతన్య స్రవంతి (The new novel therefore is described as a with drawal from external phenomena in to the flickering half shades of the authors' private world)"[15] అని వీడ్లే, "మనస్సును ప్రత్యక్షంగా సరాసరి ఉల్లేఖించటమే చైతన్య స్రవంతి (Direct quotation of mind)"[16] అని ఎడ్వర్డు బౌలింగ్ పేర్కొన్నారు.

తన జీవితాన్ని మార్చిన రామయ్యమ్మ, గవరయ్య మనోముకురంపై ప్రస్ఫుటించింది. గతమంతా తన కళ్లముందు చలన చిత్రంలా దర్శనీయమవుతుంది గవరయ్యకు. చైతన్య స్రవంతి పద్ధతిని చక్కగా నిర్వహించిన సన్నివేశానికి ఈ గవరయ్య మనస్తత్వ చిత్రీకరణ మంచి ఉదాహరణ. ఎంతో దుర్మార్గమైన పద్ధతిలో ధన సంపాదన చేసినప్పటికి గవరయ్యలో ఇంకా మానవత్వపు పోగు పూర్తిగా ధ్వంసం కాలేదు కాబట్టే తన తల్లి గురించి ఆలోచించాడు, మనోరమకు నోటు ఇవ్వగలిగాడు, రామయ్యమ్మను నిరపాయంగా వదిలేయ్యగలిగాడు. సామాజిక గమనం మారనంతకాలం ఇలాంటి గవరయ్యలకు లోటు ఉండదు.

3. వెంకట్రావు:

వెంకట్రావు తాత తండ్రులది జమిందారీ వంశం. ఆ డబ్బు, హోదా ఇప్పుడు లేకపోయినా వెంకట్రావులో ఆ వాసనపోలేదు. తన అవసరం కొద్దీ ఎదుటివాడి దగ్గరకెళ్ళి చెయ్యిచాచే పరిస్థితిలో కూడా 'దాసోహం' రీతిలో గాకుండా, దర్జాగా ప్రవర్తించే అహంకారానికి అతనిలో లోటులేదు. ఎదుటి వాళ్ళను చాలా చులకనగా చూడటం, తనెంతో గొప్పవాడిగా ఫీలవడం అతనికి వారసత్వంగా వచ్చిన లక్షణాలు. చదువు కూడ పెద్దగా అబ్బలేదు. పద్దెనిమిదేళ్ళ వయసు వరకు నిర్లక్ష్యంగా, స్నేహితులతో, అమ్మాయిల వెంటబడుతూ బాధ్యతా రహితంగా

కాలక్షేపం చేసిన వెంకట్రావుకి తండ్రి చనిపోవటంతో సంసార బాధ్యతలు తలకి చుట్టుకుంటాయి. అప్పులు నెత్తిమీద బడేసరికి వెంకట్రావుకి అప్పుడు కళ్ళు నెత్తిమీదనుండి నేల మీదకి దిగినట్లైంది. దానికి తోడు గుమస్తా కామేశం, మేనమామ నరసయ్య కూడ బలుక్కుని కొద్దో, గొప్పో మిగిలిన నగనట్రా, అస్తిపాస్తుల్ని కాజేసి వెంకట్రావుని బికారిగా నడిబజార్లో నిలబెడతారు. తండ్రిపోయిన తొమ్మిది నెలలకి తల్లి మరణించటం, తన వాళ్ళే తనకు ద్రోహం చేయ్యటం, జీవిత దారిద్ర్యం, బతుకు భయం– ఇవన్నీ వెంకట్రావు జీవిత గమనాన్ని మార్చుతాయి. అందుకని ఇది దయా దాక్షిణ్యం లేని లోకమని "మానవలోకం అనే ఈ మార్కెట్టులో ఎవడి జాగ్రత్త మీద వాడుండాలి ఎవడి లాభం వాడు చూసుకోవాలి. అవతలి వాడి లాభనష్టాలతో, కష్ట సుఖాలతో ఇవతలివాడికి సంబంధంలేదు ఎవడి కష్టం వాడు మాన్పుకోవాలి. ఎవడి సుఖం వాడు చూసుకోవాలి... ఈ అడవిలో ఏది తాడో, ఏదిపామో తెలుసుకోవటం కష్టం. తరచుగా తాడే పామవుతుంది. పామయి కరుస్తుంది కరవకుండా కాపాడుకోవాలి అవసరమొస్తే మనమే ముందు కరవాలి"[17] అని వెంకట్రావు ఆలోచిస్తాడు. తన సొంత మనుషులే తనకి ద్రోహం చేసే సరికి, కష్టాల్లో నా అనేవారు లేకపోయేసరికి ఈ లోకం పాముల పుట్టలాగ వెంకట్రావుకి కనిపించింది. ఎవడి కాటుకి దొరక్కూడదని, అవసరమొస్తే ముందుగా మనమే కాటెయ్యాలనే తీవ్ర ఆలోచనకు అతనికి జరిగిన పరిస్థితులే అతన్ని అలా ఆలోచింపజేశాయి. పరమ దుర్మార్గంగా మారే వ్యక్తి ఎప్పుడైనా ఇలానే ఆలోచిస్తాడు కాబట్టి "సిగ్గు, లజ్జ విడిచి పెట్టేశాడు. మొండి కవచం తొడిగేడు స్వలాభం అనే జెండా ఎత్తాడు. జీవితం అనే యుద్ధంలో దిగేడు"[18] అని రావిశాస్త్రి, వెంకట్రావు గురించి వ్యాఖ్యానించటం అక్షర సత్యం. ఆ సిగ్గు, లజ్జా విడిచి పెట్టిన పునాదిపై అతను కాంట్రాక్టరుగా ఎదిగి జీవితంలో నిలదొక్కుకోగలిగాడు.

ఇంత ఘన చరిత్ర గల వెంకట్రావు తన తండ్రి చనిపోయాక కుటుంబ భారం మోయలేని పరిస్థితుల్లో తన చెల్లి సావిత్రిని, తనతో పాటు చదువుకున్న సౌమ్యుడు, 'అల్పజీవి' అయిన సుబ్బయ్యకిచ్చి వివాహం చెయ్యటం, బాధ్యతల నుండి జాగ్రత్తగా బయటపడ్డ అతని మనస్తత్వాన్ని సూచిస్తుంది. 'నీ నంగిరి పింగిరి మాటలు మాని నే చెప్పినట్టు' గవరయ్యని ఐదువందల డబ్బులు అడగమని దబాయించి సుబ్బయ్యతో ఆ డబ్బులు తెప్పించుకోవడం వెంకట్రావు స్వభావాన్ని బట్టబయలుజేస్తుంది. గవరయ్యకు తిరిగి డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి యేర్పడిన సంగతి సుబ్బయ్య చెప్తే 'నువ్వు చేతగాని చచ్చు పెద్దమ్మవోయ్ బావ' అని ఏ మాత్రం తడుముకోకుండా అనగలిగిన ధీశాలి వెంకట్రావు. అందుకే 'ఎవర్నయినా సరే మోసపుచ్చడానికి వెంకట్రావు సాధారణంగా వెనుకతియ్యడు. వాడు బావైనా సరే' అని రావిశాస్త్రి వెంకట్రావు గురించి స్పష్టంగా వ్యాఖ్యానించాడు. సుబ్బయ్య భయపడుతున్నట్లుగానే వెంకట్రావు తామ తీసుకున్న డబ్బులు ఇవ్వనని, కావాలంటే 'దిక్కున్న వాడితో చెప్పుకోమను' అని గవరయ్యను ఉద్దేశించి సుబ్బయ్యతో చెప్పటం వెంకట్రావు ఎలాంటి స్వార్థపరుడో తెలియజేస్తాయి. సొంతబావ బాధపడుతున్నా ఏ మాత్రం చలించకుండా ఉంపుడుగత్తెతో కులుకుతూ, అలా మాట్లాడటం అతని నైతిక దిగజారుడుతనానికి నిదర్శనం.

బాకీ డబ్బు కోసం గవరయ్య బృందం సుబ్బయ్యను చితకబాదినాక, ఎంతకాదన్నా సుబ్బయ్య తన బావనే దృష్టితో కాబోలు వెంకట్రావు గవరయ్యపై మండిపడి, అతని పూర్వవృత్తాంతం, తన దగ్గర ఉంపుడుగత్తెగా ఉన్న అతని ఒకనాటి భార్య అయిన రామయ్యమ్మని అడ్డం బెట్టుకొని బ్లాక్మెయిల్ రాజకీయం మొదలెడతాడు. ఇదికూడా డబ్బుని దృష్టిలో ఉంచుకొనే వెంకట్రావు అలా ప్రవర్తించింది. దగ్గర వారిని కూడ దగా చెయ్యటానికి వెనుదీయని నీచ ప్రవృత్తి ఇతనిది. వ్యాపార పెట్టుబడిదారీ సమాజంలో మానవ సంబంధాలు వ్యాపార దృష్టితోనే కొనసాగుతాయనే దానికి వెంకట్రావు ఓ నిదర్శనం. సామాజిక మార్పుతోనే వెంకట్రావులాంటి వాళ్ళు మారేది.

4. మనోరమ:

సుబ్బయ్య జీవితాన్ని మలుపుదిప్పి, అతనిలో చైతన్యాన్ని రగిలింపజేసిన స్త్రీమూర్తి మనోరమ. భారతీయ విద్యాలయంలో టీచరుగా పనిజేస్తుంది. సుబ్బయ్య రాత్రిపూట విచారంగా వంతెనపై కూర్చొని ఉండగా మనోరమ అతనిని కలిసి మాట్లాడిన తీరు సుబ్బయ్యలో ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తుంది. ఈ లోకంలో తనపై జాలి పడేవారెవరన్నా ఉన్నారంటే ఆ ఒక్క వ్యక్తి మనోరమ అని సుబ్బయ్య భావించటం వల్ల, మనోరమ సాహచర్యం అతనిలో ఎంతటి మార్పుని గలిగించిందో గమనించవచ్చు. ఆమె చనువుని సుబ్బయ్య కూడ అపార్థం జేసుకొని, "నా ఇంటికి వచ్చి నా పీకల మీద ఆవిడ కూర్చుంటే నేనేం చేసేది? నాకు పెళ్ళం పిల్లలు ఉన్నారు గదా"[19] అనేంత ఆలోచనకు లోను చేసింది.

అయినప్పటికి సుబ్బయ్య మనోరమ స్నేహాన్ని కోరుకుంటాడు. ఈ బాధలన్నింటి నుంచి మనోరమ ఒక్కటే తనని కాపాడగలిగిన వ్యక్తి అని కాసేపైన సుబ్బయ్య తలంచుతాడు. సుబ్బయ్యకు మనోరమ వట్టి ఓదార్పు నియ్యటమేగాదు, సర్వ సుఖాన్ని అందించి ఆనందపరిచింది.

గవరయ్య బృందం తనకు చేసిన అవమానం గురించి సుబ్బయ్య మనోరమతో చెప్పగా, ఆమె గవరయ్య తనకు బాగా తెలిసిన వ్యక్తి అని, తాను తప్పకుండా ఆ నోటు తీసుకొస్తానని చెప్పి, ఆ నోటు తెచ్చి సుబ్బయ్యకు మరీ దగ్గరైంది మనోరమ. సుబ్బయ్యలో జీవితంపై ప్రేమని, బ్రతుకుపై ఆశని, ఆత్మవిశ్వాసాన్ని కలిగించిన చైతన్య స్రవంతిగా మనోరమ 'అల్పజీవి' నవలలో దర్శనమిస్తుంది.

పై పాత్రలతో పాటు ఈ నవలలో నర్సయ్య, కామేశం లాంటి అవకాశవాదులు, నూకరాజులాంటి లౌక్యపు వ్యక్తిత్వమున్న పాత్ర, దురహంకారం, లెక్కలేని తనంగల జమిందారీ మనస్తత్వమున్న సుబ్బయ్య భార్య సావిత్రి, డబ్బు, హోదాగల పెద్దమనుషుల కామానికి సంసారాన్ని బలిచేసుకొని, తదనంతర జీవితాన్ని పాడుజేసుకున్న గవరయ్య భార్య రామాయ్యమ్మ, తన దగ్గర పనిచేసే చలిచీమల్లాంటి వాళ్ళ జీవితాల్లో తన అధికార హోదాతో, కామం కళ్ళకెగదట్టి నిప్పులుపోసే తాశీల్దారుపాత్ర, దురహంకారాన్ని భరించలేని మానవతగల పోతన్న పాత్ర, ప్రభుసేవకే అంకితమైన పోతరాజు, ఆఫీసులో పరస్పరం దెబ్బతీసుకుంటూ, తమ ఆటలో ఇతరుల్ని కూడ బలితీసుకున్న రామస్వామి, అవధానులు మొదలైన పాత్రలు 'అల్పజీవి' తెరపై సంపూర్ణంగా మనకు కన్పించటానికి దోహదపడ్డాయి. మధ్యతరగతి జీవితానికి మంచి ప్రతినిధి సుబ్బయ్య. 'అల్పజీవి'లోని పాత్రలు ప్రధానంగా మధ్య తరగతి, మధ్యతరగతి దిగువ వర్గ పాత్రలు.

ముగింపు :

1. రావిశాస్త్రి అల్పజీవి నవలలో ఇతివృత్తం ప్రధానంగా మధ్యతరగతి ప్రజల మానసిక సంవేదనలు. వీటిని రచయిత సుబ్బయ్య పాత్రలో వాస్తవికంగా చిత్రించారు.
2. మన సమాజంలోని విభిన్న మనస్తత్వాలు గల వ్యక్తులను ఈ నవలలో రావిశాస్త్రిగారు చిత్రించిన తీరు ప్రశంసనీయం.
3. ఫ్రాయిడ్ మనోవైజ్ఞానిక సిద్ధాంతం, ఆడ్లార్ ఆత్మ న్యూనతాభ్రాంతి సిద్ధాంతాల ఆధారంగా తెలుగులో వచ్చిన నవలలో శాశ్వత విలువలు కలిగిన నవలగా ఈ అల్పజీవి నవలను ఖచ్చితంగా చెప్పవచ్చు. ఈ నవల మన సమాజంలో భిన్నతరగతుల ప్రజల మనస్తత్వాలను రావిశాస్త్రి అర్థం చేసుకున్నా విధానానికి నిదర్శనం.
4. వ్యక్తులలో మానసిక సమస్యలు బాల్యదశలోనే కుటుంబ, పరిసరాల ప్రభావం వలన ఏర్పడతాయని, వాటి ప్రభావం ఆ వ్యక్తిపై సుదీర్ఘ కాలం ఉంటుందని వివరిస్తూ, ఇటువంటి వ్యక్తులకు సరైన ప్రోత్సాహం, ప్రేరణ ఇస్తే ఆ సమస్యల నుండి సులభంగా బయట పడగలరని రచయిత ఈ నవలలోని సుబ్బయ్య, మనోరమ పాత్రల ద్వారా మనముందుంచారు.
5. మన సమాజంలోని భిన్న మనస్తత్వాలు గల వ్యక్తులు భిన్న సన్నివేశాల్లో ప్రతిస్పందించే తీరును ఈ నవలలో రావిశాస్త్రి అద్భుతంగా చిత్రించారు.

పాద సూచికలు :

1. రాచకొండ విశ్వనాథశాస్త్రి రచనాసాగరం, పుట 1331
2. కాళీపట్నం రామారావు రచనలు, పుట 379
3. తెలుగు సాహిత్య చరిత్ర, పుట 654
4. ఇదే, పుట 654
5. తెలుగు నవల(సంక్షిప్త చరిత్ర), పుట 12
6. ఆధునికాంధ్ర సాహిత్యంలో చైతన్య స్రవంతి, పుట 84
7. నవల–ప్రజలు, పుట 102
8. అల్పజీవి నవల, పుట 199
9. నవలాశిల్పం, పుట 32
10. ఆధునికాంధ్ర సాహిత్యంలో చైతన్య స్రవంతి, పుట 84
11. రావిశాస్త్రి సాహిత్య దృక్పథం, పుట 48
12. ఇదే, పుట 48
13. అల్పజీవి నవల, పుట 182

14. అల్పజీవి నవల, పుట 174
15. ఆధునికాంధ్ర సాహిత్యంలో చైతన్య స్రవంతి, పుట 28
16. ఆధునికాంధ్ర సాహిత్యంలో చైతన్య స్రవంతి, పుట 29
17. అల్పజీవి నవల, పుట 32
18. ఇదే, పుట 33
19. ఇదే, పుట 125

ఉపయుక్త గ్రంథాలు :


1. రామారావు కాళీపట్నం.(1999).కాళీపట్నం రామారావు రచనలు, మనసు ఫౌండేషన్, బెంగళూర్.
2. ద్వా.నా.శాస్త్రి.(2013).తెలుగు సాహిత్య చరిత్ర, ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్.
3. విశ్వనాథశాస్త్రి రాచకొండ.(2007).రాచకొండ విశ్వనాథశాస్త్రి రచనాసాగరం, మనసు ఫౌండేషన్, బెంగళూర్.
4. రామకృష్ణారావు వై.(1987).ఆధునికాంధ్ర సాహిత్యంలో చైతన్య స్రవంతి, వేదిక సాహితీ సాంస్కృతిక సంస్థ, హైదారాబాద్.
5. కాత్యాయనీ విద్మహే, యాదయ్య మార్క.(1996).రావిశాస్త్రి సాహిత్య దృక్పథం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదారాబాద్.
6. విశ్వనాథశాస్త్రి రాచకొండ.(1981).అల్పజీవి, అరుణా పబ్లిషింగ్ హౌస్,
7. వెంకట సుబ్బయ్య వల్లంపాటి.(1994). నవలాశిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదారాబాద్.
8. వెంకట సుబ్బయ్య వల్లంపాటి.(1992). నవల –ప్రజలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదారాబాద్.
9. నవీన్ అంపశయ్య.(2012). తెలుగు నవల(సంక్షిప్త చరిత్ర), తెలుగు అకాడమి, హైదరాబాద్.